నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, మంగళవారం 23 జూలై 2024 | HYDERABAD

ఇద్దరు అంతర్రాష్ట్ర స్మగ్లర్లు అరెస్ట్

సిటీబ్యూరో: రాజస్థాన్ నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్ రవాణా చేస్తున్న ఇద్దరు అంతర్రాష్ట్ర స్మగ్లర్లను పోలీసులు అరెస్ట్ చేసి.. వారి వద్ద నుంచి మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. రాచకొండ సీపీ సుధీర్‌బాబు వివరాలు వెల్లడించారు. రాజస్థాన్‌కు చెందిన ఓం రామ్ అలియాస్ ఓం ప్రకాశ్ , అతడి స్నేహితుడు సాన వాల రామ్ లింగంపల్లిలో ఉంటున్నారు. వీరిద్దరికీ డ్రగ్స్ అలవాటు ఉంది. మధ్య ప్రదేశ్‌కు చెందిన ముకేశ్ వద్ద డ్రగ్స్ కొని హైదరాబాద్‌లో విక్రయించేందుకు ప్లాన్ చేశారు. ఇందులో భాగంగా పోలీసులకు చిక్కకుండా ఉండేలా బస్సులు, లారీలు, ఆటోల్లో ప్రయాణించి హైదరాబాద్ శివారుకు చేరుకున్నారు. ఎస్ఓటీ ఎల్బీనగర్ డీసీపీ మురళీధర్ నేతృత్వంలోని బృందాలకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో జవహర్‌నగర్ పోలీసులతో కలిసి తిమ్మాయిపల్లి గ్రామ శివా రులో ఓం ప్రకాశ్, రామ్‌ను పట్టుకున్నారు.

కార్పొరేట్ సంస్థలు అండగా నిలవాలి

సిటీబ్యూరో, జూలై 22 (నమస్తే తెలంగాణ) : దివ్యాంగ పిల్లల మెరుగైన భవిష్యత్‌కు కార్పొరేట్ సంస్థలు సామాజిక బాధ్యతగా కృషి చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ఆలియా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలంగాణ నిర్మాణ సంస్థ, బోష్ ఆధ్వర్యంలో పున రుద్ధరించిన భవిత కేంద్రాన్ని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌తో కలిసి ఆయన ప్రారంభిం చారు. అనంతరం సోషల్ ఇంపాక్ట్ గ్రూప్ డైరెక్టర్ అర్చన సురేశ్ మాట్లాడుతూ.. నగరంలో 18 భవిత కేంద్రాలు విజయవంతంగా పునరుద్ధరించామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా 450 మంది దివ్యాంగ పిల్లలకు మెరుగైన విద్యా సౌకర్యాలు అందుబాటులోకి వస్తా యని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఈఓ రోహిణీ తదితరులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల ధర్నా | ఆశవర్కర్ల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆశ వర్కర్ యూనియన్ జిల్లా కార్యదర్శి రేవతి కల్యాణి డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ గౌతమ్‌కు వినతిపత్రం అందజేశారు. కాగా, కలెక్టరేట్‌కు వచ్చిన సందర్భంగా ఎమ్మెల్యే వివేకానంద్‌కు ఆశవర్కర్లు తమ సమస్యలను వివరించారు. ఆశ వర్కర్ల సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడుతానని ఎమ్మెల్యే అన్నారు. -మేడ్చల్ కలెక్టరేట్, జూలై 22

మూసీ ఓకే.. మరీ వసతులు?

సుందరీకరణ అంచనా వ్యయంపై భిన్నాభిప్రాయాలు

సిటీబ్యూరో, జూలై 22 (నమస్తే తెలంగాణ) : మూడు నెలల్లో లక్ష కోట్లకు పెరిగిన మూసీ సుందరీకరణ అంచనా వ్యయంపై ఇంకా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతూనే ఉన్నాయి. గోపన్‌పల్లి వేదికగా సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను నగరవాసులు, సామాజికవేత్తలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. లండన్‌లోని థేమ్స్ నది తరహాలో హైదరాబాద్‌కు జీవనది అయిన మూసీ ప్రక్షాళన చేయడం మంచిదే. కానీ ప్రజలకు మెరుగైన సౌకర్యాలను కల్పించాల్సిన ప్రాజెక్టులపై ఎందుకు సీఎం దృష్టి పెట్టడం లేదనే ప్రశ్నలు వస్తున్నాయి. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు కింద మూసీని గోదావరి నీళ్లతో నింపాలనే ప్రతిపాదనలకు అప్పటి సీఎం కేసీఆర్ ప్రణాళికలు రూపొందించారు. అప్పటికే గోదావరి జలాలతో హైదరాబాద్ గొంతు తడిపేలా చేపట్టిన గోదావరి లింకేజీ గత వేసవిలో ఎంతగానో సాయపడింది. ఔటర్ రింగు రోడ్డు వెంబడి జల హారాన్ని ఏర్పాటు చేసేలా రింగ్ మెయిన్ ప్రాజెక్టుకు గత సీఎం కేసీఆర్ ఆచరణలోకి తీసుకొచ్చారు. ఆ నీళ్లతోనే జంట జలాశయాల దిగువన ఉండే మూసీ ద్వారా నల్గొండ వరకు మూసీ జలాలను తరలించాలనే కార్యాచరణను ఐదేండ్ల కిందట గత సీఎం కేసీఆర్ చేపట్టారు. వీటితో పాటు నగరంలో మౌలిక వసతులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చిన కేసీఆర్ సర్కార్..హైదరాబాద్ నగరాన్ని గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని ప్రణాళికలను శాస్త్రీయంగా రూపొందించింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక జీవన ప్రమాణాలను మెరుగుపరిచే ఎన్నో ఫ్లైఓవర్లు, అండర్‌పాసులతోపాటు, ఎక్స్‌ప్రెస్ హైవేలు, లింకు రోడ్ల కోసం గతంలో రూపొందించిన ప్రణాళికలకు మోక్షం లేకుండా పోయింది. ముఖ్యంగా హైదరాబాద్ నగరవాసులతోపాటు, ఇక్కడ వ్యాపార వాణిజ్య కార్యకలాపాలను ప్రభావితం చేసే మెట్రో విస్తరణ విషయంలో ఇప్పటికీ పూర్తి స్థాయి ప్రణాళికలను రూపొందించలేకపోయారు.

స్పందన అంతంతే!

ప్రజావాణికి ఆదరణ కరువు

సమస్యలకు పరిష్కారం లభించకపోవడంతో ప్రజల్లో అనాసక్తి

మళ్లీ కార్యక్రమానికి డుమ్మా కొట్టిన మేయర్

ప్రజావాణిలో దరఖాస్తులు పరిశీలిస్తున్న బల్దియా కమిషనర్ ఆమ్రపాలి

సిటీబ్యూరో, జూలై 22 (నమస్తే తెలంగాణ)/మేడ్చల్ కలెక్టరేట్: దీర్ఘకాలిక, అపరిష్కృత సమస్యలకు పరిష్కారం దొరుకుందని ఎంతో ఆశగా ప్రజావాణికి వస్తున్న వారికి నిరాశే మిగులుతున్నది. ప్రజా సమస్యలను స్వీకరించి పరిష్కరించి.. అర్జీదారుల్లో భరోసా నింపాల్సిన అధికారులు..కంటి తుడుపు చర్యగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. స్వీకరించిన దరఖాస్తులకు పరిష్కారం చూపడం లేదు. ఫలితంగా ప్రజావాణిపై నమ్మకం లేకనే కార్యక్రమంపై ఫిర్యాదుదారులు ఆసక్తి చూపడం లేదు. ఈ నేపథ్యంలోనే సోమవారం నిర్వహించిన ప్రజావాణికి అంతంత మాత్రమే స్పందన కనిపించింది. కేవలం 32 ఫిర్యాదులను మాత్రమే అధికారులు నేరుగా స్వీకరించారు. అర్జీదారులు లేకపోవడంతో కమిషనర్ ఆమ్రపాలి ప్రజావాణి నుంచి త్వరగానే వెళ్లిపోయారు. ఈసారి సైతం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ప్రజావాణికి డుమ్మా కొట్టారు. మరోవైపు ప్రజావాణిలో వచ్చిన విన్నపాలను ఎప్పటికప్పుడు పరిష్కరించడంపై అధికారులు దృష్టి సారించాలని కమిషనర్ ఆమ్రపాలి అధికారులకు సూచించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో పాల్గొన్న ఆమె.. నలుమూలల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి విజ్ఞప్తులను కమిషనర్ స్వీకరించారు. ఆయా అర్జీలను సంబంధిత అధికారులకు అందజేసి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. జాప్యం లేకుండా ప్రజావాణిలో వచ్చిన విన్నపాలపై దృష్టి సారించి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. కాగా, ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 32 విన్నపాలు రాగా, టెలిఫోన్ ద్వారా మరో 11 విన్నపాలు వచ్చాయని అధికారులు తెలిపారు. వచ్చిన దరఖాస్తుల్లో 15 టౌన్‌ప్లానింగ్, ట్రాన్స్‌పోర్టు ఒకటి, సీవీఓ/రెవెన్యూ రెండు, సీఎం అండ్ హెచ్ఓ రెండు, స్పోర్ట్స్ రెండు, ఇంజినీరింగ్ మెయింటెనెన్స్ మూడు, వెటర్నరీ 2, జలమండలి రెండు, ఎస్టేట్స్ ఒకటి, హౌసింగ్ రెండు విన్నపాలు వచ్చినట్లు తెలిపారు. ఆరు జోన్లలో ప్రజావాణి నిర్వహించగా..81 దరఖాస్తులను స్వీకరించారు. కూకట్‌పల్లి జోన్‌లో అత్యధికంగా 42, శేరిలింగంపల్లిలో 20, చార్మినార్‌లో 8, సికింద్రాబాద్‌లో 7, ఎల్బీనగర్‌లో ఒకటి, ఖైరతాబాద్‌లో మూడు అర్జీలను అధికారులు స్వీకరించారు. అదనపు కమిషనర్లు శ్రీవాస్తవ, నళిని పద్మావతి, సత్యనారాయణ, చంద్రకాంత్‌రెడ్డి, సీసీపీ రాజేంద్రప్రసాద్ నాయక్, సీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ పద్మజ, ఎస్ఎన్‌డీపీ ఎస్ఈ కోటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

108 దరఖాస్తుల్లో 73 డబుల్ ఇండ్ల కోసమే..

డబుల్ బెడ్రూం ఇండ్లు కేటాయించాలంటూ హైదరాబాదీలు కలెక్టరేట్‌కు పోటెత్తుతున్నారు. ప్రతి సోమవారం జరిగే ప్రజావాణిలో అత్యధికంగా వీటికి సంబంధించినవే ఎక్కువ సంఖ్యలో వినతి పత్రాలు వస్తున్నాయని అధికారులు తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణిలో 108 దరఖాస్తులు రాగా.. ఇందులో 73 డబుల్ బెడ్రూం ఇండ్లకు సంబంధించిన దరఖాస్తులు కావడం విశేషం. కాగా, ఇప్పటి వరకు హైదరాబాద్‌లో వేలల్లో డబుల్ బెడ్రూంలకు సంబంధించి దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు చెప్పారు. దీంతో గృహ నిర్మాణ శాఖలో దరఖాస్తులు కుప్పలు తెప్పలుగా పేరుకుపోతున్నాయి. తమ దరఖాస్తుపై అధికారులు స్పందించడం లేదని ప్రతి సోమవారం ప్రజలు కలెక్టరేట్‌కు వచ్చి గృహనిర్మాణ శాఖ అధికారుల వద్ద వాపోతున్నారు. డబుల్ బెడ్రూంలకు సంబంధించి ఆదేశాలు వచ్చిన తర్వాత సమాచారం తెలియజేస్తామని దరఖాస్తుదారులను వెనక్కి పంపిస్తున్నారు. వర్షాలు భారీగా కురుస్తుండటంతో సరైన ఇల్లు లేని వారందరూ ఇప్పుడు డబుల్ బెడ్రూంల కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం ఇల్లు నిర్మించి ఇవ్వాలని జనం డిమాండ్ చేస్తున్నారు.

మేడ్చల్‌లో..

ప్రజావాణి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో 75 దరఖాస్తులు వచ్చాయి. అలాగే నాగారం మున్సిపల్ కార్యాలయంలో 2, దమ్మాయిగూడలో జరిగిన ప్రజావాణిలో 6 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

గ్రేటర్‌లో దోమల నియంత్రణకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టి వ్యాధులు ప్రబలకుండా కట్టుదిట్టమైన జాగ్రత్తలు తీసుకోవాలని బల్దియా కమిషనర్ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. జోనల్ కమిషనర్లు, అదనపు కమిషనర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు. దోమలు వృద్ధి చెందకుండా వాటి ఉత్పత్తి ప్రదేశాల్లో గంబూషియా, ఆయిల్ బాల్స్ వేయాలని ఆదేశించారు. దోమల నివారణకు ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని, వర్షాకాలంలో డెంగీ, చికున్ గున్యా, టైఫాయిడ్, డయోరియా, విష జ్వరాలు వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆరోగ్య సేవలు అందించాలని, ఎక్కడైనా మలేరియా, డయేరియా, డెంగీ వంటి వ్యాధి సోకితే, అలాంటి ప్రాంతాల్లో నివారణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పారిశుధ్య సమస్య తలెత్తకుండా శానిటేషన్ సవ్యంగా జరిగేలా క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని సూచించారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు పనులను పర్యవేక్షిస్తున్న విజిలెన్స్ అధికారి లక్ష్మిరెడ్డి

కదిలారు.. తొలగించారు

గండిపేట కాలువపై అక్రమ నిర్మాణాల తొలగింపు

నమస్తే ఎఫెక్ట్

మణికొండ: గండిపేట కాలువ (క్యాండూట్) పై అక్రమ నిర్మాణాలపై జలమండలి విజిలెన్స్ అధికారులు విచారణ కోసం కదిలారు. ఈ నెల 21న 'నమస్తే'లో ప్రచురితమైన 'వాటా ఇచ్చుకో.. వ్యాపారం చేసుకో' కథనంపై జలమండలి ఉన్నతాధికారులు స్పందించారు. కమిషనర్ ఆదేశాల మేరకు స్థానిక సెక్షన్ -17 డీజీఎం నరహరితో జలమండలి విజిలెన్స్ అధికారి లక్ష్మిరెడ్డి, సురేశ్ మణికొండ, నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని గండిపేట కాలువను సందర్శించారు. క్యాండూట్‌పై వెలిసిన అక్రమ నిర్మాణాలు, వ్యాపార కేంద్రాలను తక్షణమే తొలగించేందుకు యుద్ధప్రతిపాదికన చర్యలు చేపట్టారు. కాలువ శిథిలావస్థకు చేరుకోవడానికి జలమండలి సిబ్బంది వైఖరే కారణమంటూ.. స్థానికులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. పుప్పాలగూడ బీఆర్‌సీ ఎదురుగా ఓ నిర్మాణ సంస్థ క్యాండూట్‌పై నిర్మించిన పైకప్పు, టైల్స్‌తో పాటు రేకులను జేసీబీల సహాయంతో తొలగించారు. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన అక్రమ నిర్మాణాలు కొన్నింటిని తొలగించామని, మిగిలిన వాటిని స్థానిక పోలీసులు, మున్సిపల్ అధికారుల సహాయంతో తొలగిస్తామని విజిలెన్స్ అధికారులు లక్ష్మిరెడ్డి, సురేశ్ తెలిపారు.

డ్రైవర్లకు పార్కుల డ్యూటీ!

బల్దియా కార్యాలయం ఎదుట కార్మికుల నిరసన

సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ ట్రాన్స్‌పోర్టు విభాగంలో పనిచేసే ఔట్ సోర్సింగ్ కార్మికులను అధికారులు మానసిక క్షోభకు గురి చేస్తున్నారని, 25 మంది వేతనాలు నిలిపివేశారని కార్మికులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ట్రాన్స్‌పోర్టు విభాగంలో డ్రైవర్లుగా ఏండ్ల తరబడి పనిచేస్తున్నామని, డ్రైవర్లను పార్కులు, చెరువు వద్ద డ్యూటీలు వేస్తూ ముప్పుతిప్పలు పెడుతున్నారని ఆరోపించారు. ఈవీడీఎం అధికారుల తీరుకు నిరసనగా సోమవారం జీహెచ్ఎంసీ కార్యాలయం ఎదుట కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన చేపట్టి ధర్నా చేశారు. సకాలంలో వేతనాలు చెల్లించాలని, చాలీచాలనీ వేతనాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, అడ్మిస్ట్రేటివ్ ఆఫీసర్ అమృత్‌రెడ్డిని వేడుకున్న ఫలితం లేదని కార్మికులు ఆరోపించారు.

నిరసన తెలుపుతున్న కార్మికులు

సమీక్షా సమావేశంలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, బల్దియా కమిషనర్ ఆమ్రపాలి, సీపీ శ్రీనివాస్‌రెడ్డి

బ్రాండ్ ఇమేజ్ మరింత పెంచాలి

డ్రగ్స్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దాలి.. సమీక్షా సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం

సిటీబ్యూరో: నగరాన్ని డ్రగ్స్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. పలు నియోజకవర్గాల్లో ఉన్న సమస్యలు, బడ్జెట్‌లో నగరానికి కావాల్సిన అవసరాలపై మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన సోమవారం హైదరాబాద్ జిల్లా అభివృద్ధిపై సమీక్షా సమావేశం జరిగింది. ఎమ్మెల్యేలు శ్రీ గణేశ్, కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, మహ్మద్ ముబిన్, కౌసర్ మోహినుద్దీన్, బలాల, మాజీద్ హుస్సేన్, జాఫర్ హుస్సేన్, ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, ప్రభాకర్ రావు, మీర్జా రియాజ్ ఉల్ హుస్సేన్ తదితరులు హాజరయ్యారు. బడ్జెట్ సమావేశాల్లోపు నగర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కని కలిసి నగర అభివృద్ధికి కావాల్సిన అవసరాలు, పెండింగ్ బిల్లులు, ఎస్ఆర్‌డీపీ, ఎస్ఎన్‌డీపీ పనుల పురోగతి తదితర అంశాలపై విజ్ఞప్తి చేయాలని సమావేశంలో చర్చించారు. నగరంలో స్కూళ్లలో ఉన్న పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని మంత్రి సూచించారు. హైదరాబాద్ అభివృద్ధిపై ప్లాన్ ఆఫ్ యాక్షన్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ మరింత పెంచేలా చర్యలు చేపట్టాలని మంత్రి అన్నారు. సమావేశంలో పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

4 ఎస్టీపీలు..రూ. 65.05 కోట్లతో టెండర్లు

సిటీబ్యూరో: ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌లకు మురుగు నీటి నుంచి శాశ్వత విముక్తి కల్పించేందుకు జలమండలి చర్యలు చేపట్టింది. 4 చోట్ల ఎస్టీపీలు నిర్మించాలని నిర్ణయించింది. ఈ మేరకు రూ. 65.05 కోట్ల అంచనా వ్యయంతో టెండర్లు పిలిచారు.

ఎస్‌టీపీల పరిశీలన

కుత్బుల్లాపూర్/బాలానగర్: త్వరలో ప్రారంభం కానున్న జీడిమెట్ల వెన్నెలగడ్డ ఎస్‌టీపీని బల్దియా కమిషనర్ ఆమ్రపాలి సోమవారం సందర్శించారు. కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ చౌహాన్‌తో పాటు కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్ నర్సింహ, వివిధ విభాగాల అధికారులతో కలిసి చెరువు పరిసర ప్రాంతాన్ని పరిశీలించారు. అలాగే ఫతేనగర్ డివిజన్‌లో నిర్మాణ పనులు పూర్తి చేసుకున్న మురుగు నీటి శుద్ధి కేంద్రం (ఎస్టీపీ)ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి తెలిపారు. ఫతేనగర్ డివిజన్ ఎల్బీఎస్ నగర్‌లో నిర్మాణ పనులు పూర్తి చేసుకుంటున్న ఎస్టీపీని జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి ఆమె సందర్శించారు.

కస్టమర్ కేర్ సెంటర్‌లో వినియోగాదారుల స్పందనను తెలుసుకుంటున్న ఎండీ అశోక్‌రెడ్డి

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై

అనర్హత వేటు ఖాయం

కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్

మేడ్చల్, జూలై 22(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడటం ఖాయమని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ ఆవరణలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మరో 6 నెలల్లో ఉప ఎన్నికలు వస్తాయన్నారు. ఆ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా గెలుపొందుతారన్నారు. కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై స్పీకర్ మూడు నెలల్లో చర్యలు తీసుకోవాలన్నారు.

పరిష్కారం కాకుండానే..

అయినట్లు ఫీడ్‌బ్యాక్

జలమండలి ఎండీ అసంతృప్తి

సిటీబ్యూరో, జూలై 22 (నమస్తే తెలంగాణ) : జలమండలి కస్టమర్ కేర్ సెంటర్ (ఎంసీసీ)ని ఎండీ అశోక్‌రెడ్డి సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. వినియోగదారుల నుంచి వస్తున్న కాల్స్, స్పందనను ఆయన పరిశీలించారు. ఇందుకోసం స్వయంగా కొందరు వినియోగదారులతో ఎండీ మాట్లాడారు. కాల్ రికార్డింగ్స్ విన్నారు. సీవరేజీ ఓవర్ ఫ్లో, రోడ్డుపై సిల్ట్, మ్యాన్ హోల్స్ వంటి వాటిపై ఫిర్యాదులు వచ్చాయి. సమస్య పరిష్కారమైన తర్వాత వినియోగదారులకు కచ్చితంగా సమాచారం అందించాలని ఎండీ అశోక్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. తర్వాత వినియోగదారుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. మొత్తం 5514 ఫీడ్ బ్యాక్ కాల్స్ తీసుకోగా, అందులో 3 శాతం మంది అసంతృప్తి వ్యక్తం చేశారు. 14 శాతం మంది సమస్యను పరిష్కరించకుండానే పరిష్కారమైనట్లు ఫీడ్ బ్యాక్ ఇచ్చారు. అలాంటి వాటి విషయంలో క్షేత్రస్థాయిలో ఉన్న అధికారులు..వాటిని నేరుగా సందర్శించి, పరిష్కారమయ్యేలా చూడాలని ఎండీ ఆదేశించారు. వినియోగదారులకు మంచి సేవలు అందించడంతో పాటు కస్టమర్ కేర్ సేవా కార్యకలాపాల్లో పారదర్శకత, జవాబుదారీతనం చూపేందుకే ఈ తనిఖీ నిర్వహించామన్నారు. జూన్‌లో 1,30,899 మంది ట్యాంకర్లు బుక్ చేసుకోగా, 1,86, 251 ట్రిప్పులు డెలివరీ చేసినట్లు అధికారులు తెలిపారు. జూన్‌లో 75, 555 ఫిర్యాదులు రాగా..అందులో 75,496 సమస్యలను పరిష్కరించినట్లు చెప్పారు.